క్లుప్తంగా

కార్మికుడికి పరామర్శ



పరామర్శిస్తున్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మున్సిపల్ కార్మికుడు గణేష్‌ను సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి పరామర్శించారు. ఆదివారం ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పలువురు ఉన్నారు.

తాగునీటికి కటకట



నిరసన తెలుపుతున్న మహిళలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని 12వ వార్డులో తాగునీట కటకట మొదలైంది. వేసవి కావడంతో జనాలు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, చేతిపంపుల ద్వారా నీరు రాకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఆర్థోపెడిక్ వైద్యుడు సందీప్ పవార్ జన్మదినాన్ని పురస్కరించుకొని బస్టాండ్‌లో ప్రయాణికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బండ అనిల్ కుమార్, సభ్యులు సామల రవి, మల్లికార్జున్, సునీల్‌కుమార్, సుమంత్, నరేశ్, రాజు యాదవ్, శంకర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని డబ్బులడిగితే చర్యలు

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని పేదల నుంచి డబ్బులు అడిగే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందిరమ్మ కమిటీ లబ్ధిదారులు సిఫారసు చేసినప్పటికీ గజిటెడ్ సూపర్‌వైజరీ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అన్ని విధాలుగా పరిశీలించి నిరుపేదలను మాత్రమే సిఫారసు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు సిఫారసు చేసినప్పటికి అందులో అనర్హులు ఉంటే వారిని తొలగించి అర్హులను మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

టిప్పర్ పట్టివేత

బేల: మండలంలోని కాంఘుర్‌పూర్ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి నార్నూర్ మండలానికి శనివారం రాత్రి అక్రమ ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఏఎస్సై జీవన్, పోలీసు సిబ్బంది పట్టుకున్నట్లు ఆదివారం జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడిన టిపర్ యాజమాని కృష్ణ, డ్రైవర్ బానుదాస్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేలవాలిన జొన్న

తాంసి: ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులకు శనివారం రాత్రి కురవడంతో జొన్న పంట నేలవాలింది. తాంసి, భీంపూర్ మండలాలోని తాంసి, కప్పర్ల, పొన్నారి, హస్నాపూర్, వడ్డాడి, సావర్గాం, భీంపూర్, వడ్‌గాం, పాలోది గ్రామాల్లో చిరుజల్లుల వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల శివారులో సాగుచేసిన జొన్నపంట స్వల్పంగా దెబ్బతింది. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో విక్రయానికి రైతులు తీసుకొచ్చిన జొన్నపంట సైతం వర్షానికి తడిసి పోయింది.

సీజనల్ ఉపాధి..

- పుచ్చకాయ, దోసకాయలకు గిరాకీ
- అందుబాటు ధరలో లభ్యం
- వడదెబ్బ తగలకుండా ఉపశమనం



మార్కెట్లో పుచ్చకాయలు



దోసకాయలు విక్రయిస్తున్న వ్యాపారి

ఇచ్చోడ: సీజనల్‌గా లభించే పండ్లను తింటే ఆరోగ్యంతో పాటు శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. అనారోగ్యం భారినపడిన వారికి పండ్లు టానిక్‌లాగా పనిచేస్తాయి. ప్రసుతం మార్కెట్లో సీజ నల్ పండ్లకు డిమాండ్ పెరిగింది. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ధరలు కూడా అందుబాటులో ఉండే సరికి పండ్ల మార్కెట్ కిటకిటలాడుతోంది. ప్రతీరోజు పండ్లు అమ్ముతూ చిరువ్యాపారులు ఉపాధి పొందుతున్నారు.

దోస, పుచ్చకాయలకు డిమాండ్..

వేసవిలో చల్లదానాన్ని ఇచ్చే దోస, పుచ్చకాయలకు గిరాకీ పెరిగింది. ఇవి మార్కెట్లో తక్కువ ధరలకు లభిస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే పలు గ్రామాల్లో పుచ్చకాయ సాగు చేయడం కూడా ధరల నిలకడకు దోహదపడుతుంది. పట్టణంలోని పలు కూడళ్ల వద్ద తోపుడు బండ్లపై దోసకాయలు విక్రయిస్తున్నారు. కిలో ధర రూ. 50 నుంచి రూ. 60 వరకు అమ్ముతున్నారు. అలాగే రోడ్ల పక్కన పుచ్చకాయ విక్రయ కేంద్రాలు వెలిశాయి. పుచ్చకాయలు కిలోకు రూ. 20 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తున్నారు. పుచ్చకాయలను చిన్ని సైజుల్లో కట్ చేసి చల్లని ఐస్‌పై పెట్టి అమ్ముతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు దోస, పుచ్చకాయలను కొనుగోలు చేస్తున్నారు.

వేసవిలో లభించే పండ్లు..

ఖర్బూజ, ఆనాస(పైనాపిల్), బొప్పాయి, దానిమ్మ, ఖర్జూర, నేరేడు, పుచ్చకాయ, సపోటా, జామ, ద్రాక్ష, మామిడి, నారింజ నిమ్మ తాటి పండు, అంజీర్, తాటి పండ్లు ఆరోగ్యంతో పాటు వేసవిలో వేడి నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ కారణంగా వేసవిలో లభించే పండ్లకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది.

పండ్లతో ఆరోగ్యం



సీజనల్ పండ్లను తినడంతో ఆరోగ్యంగా ఉండవచ్చు. అన్ని కాలాల్లో పండ్లను మోతాదులో తీసుకోవాలి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరూ పండ్లను తినడం అలవాటు చేసుకోవాలి. వేసవిలో దోస, పుచ్చకాయలను తినడం వల్ల వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు.

– రాథోడ్ రవి, చిన్నపిల్లల వైద్య నిపుణులు

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం



సీజ్ చేసిన టిప్పర్‌తో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు జైనథ్ సీఐ సాయినాథ్ అన్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఎక్కడ ఎలాంటి అక్రమ దందాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా.. కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆనందపూర్ గ్రామం పెన్‌గంగా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఆదివారం ఉదయం జైనథ్ ఎస్సై పురుషోత్తం, పోలీస్ సిబ్బందితో కలిసి ఇసుక టిప్పర్ (టీజీ 01టీ 0365)ను సీజ్ చేయడం జరిగిందన్నారు. టిప్పర్ యజమాని తాటిపల్లి కరుణాకర్ రావు, ఇసుక రవాణా చేసే కరణ్ రెడ్డితో పాటు డ్రైవర్ సైతం మారుతిలపై ఇసుక దొంగతనం కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలి



నినాదాలు చేస్తున్న టీం సభ్యులు

ఆదిలాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో నిస్సహాయులైన పర్యాటకులపై అత్యంత పాశవికంగా కాల్పులకు తెగబడిన ఉగ్ర మూకలను కఠినంగా శిక్షించాలని గాంధీపార్కు యోగా టీం సభ్యులు అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో ఆదివారం పహల్గాం మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడులకు పాల్పడ్డారన్నారు. మతాన్ని అడిగి మరి దాడి చేయడం శోచనీయమన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అదే విధంగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌ను సైతం అంతర్జాతీయంగా ఒంటరిని చేయాలన్నారు. టీం సభ్యులు గౌరీ సంజయ్, సాయిప్రసాద్, రమేశ్, సంతోష్, రమేశ్, తిరుమల రెడ్డి, మనోహర్, వెంకటరెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: కశ్మీర్‌లో ఉగ్రదాడికి కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని జావ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఫయాజ్ అహ్మద్ షామ అన్నారు. ఉగ్రదాడిని నిరసిస్తూ ఆదివారం తెలంగాణ చౌక్‌లో పాకిస్తాన్ జెండా దహనం చేశారు. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడులు చేయడం హేయమైన చర్య అని తెలిపారు. దీనికి పాకిస్తాన్ మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో భీం ఆర్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు షకీల్, మహ్మద్ అక్రమ్, నిజాం, అర్షద్ పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



చెక్కులు అందజేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఇచ్చోడ మండలం తలమద్రి గ్రామానికి చెందిన బొంగురాల అడెల్లుకు రూ.55 వేలు, బోథ్ పట్టణ కేంద్రానికి చెందిన అశోక్‌కు రూ.60 వేలు వైద్య ఖర్చుల కోసం మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న రాథోడ్ జీవన్

నేరడిగొండ: పశు పోషకులు, రైతులు తమ పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. ఆదివారం మండలంలోని కొర్టికల్(బి), ఎస్సీ కాలనీ, నాయక్‌పోడ్‌గూడ గ్రామాల్లో పశువులకు సామూహిక గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో పశువులకు టీకా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని కామగిరిలో ఆదివారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న గాలికుంటు నివారణ టీకాలను సద్వినియెగం చేసుకోవాలని కోరారు.

అమ్మే చంపేసింది?

- నంచిలో పసికందు మృతదేహం
- చిచ్‌ధరి ఖానాపూర్‌లో ఘటన

ఆదిలాబాద్‌రూరల్: వివాహేతర సంబంధానికి పుట్టిన సంతానం గుట్టు బయటకు తెలిస్తే తన పరువు పోతుందని భావించిన ఓ మహిళ.. పసికందును చంపేసిన ఘటన ఆదిలాబాద్ రూరల్ మండలం చిచ్‌ధరి ఖానాపూర్ గ్రామంలో జరిగింది. పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వర్, ఏఎస్సై రాథోడ్ మారుతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలానికి చెంది ఓ మహిళకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో వివాహేతర సంబంధం కారణంగా గర్భందాల్చింది. రెండు నెలల క్రితం బాబుకు జన్మనిచ్చింది. అయితే ఈవిషయం బయటకు పొక్కకుండా దాచింది. ఈ క్రమంలో ఇటీవల బాబును చంపి గ్రామ శివారులోని పొలంలో పాతిపెట్టింది. ఆదివారం పొలంలో దుర్వాసన రావడంతో ఓ మహిళ పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చింది. దీంతో జ్ఞానేశ్వర్ వెళ్లి చూడగా ఓ సంచిలో పసికందు మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసుకు సమాచారం అందించాడు. ఏఎస్సై ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. వివరాలు సేకరించగా, గ్రామానికి చెందిన ఓ మహిళ వివాహేతర సంబంధంతో పుట్టిన బిడ్డ విషయం బయట పడితే పరువుపోతుందని ఈ ఘాతుకానికి పాల్పడిన్నట్లు అంగీకరించింది. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రజతోత్సవ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా కేంద్రంతో పాటు ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఉదయం ఆదిలాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న జెండా ఊపడంతో ప్రత్యేక వాహనంలో సభకు తరలివెళ్లారు.

- నేరడిగొండ: బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల సందర్భంగా నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం పార్టీ జెండా ఎగురవేసిన సభకు వెళ్లే ర్యాలీని ప్రారంభించారు.
- ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో రజతోత్సవ సభకు తరలివెళ్లారు. ముందుగా ఉట్నూర్ ఐబీలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించి బస్సులు, వాహనాల ద్వారా వెళ్లారు.
- తలమడుగు: మండల కేంద్రంతో పాటు కుచులపూర్, లింగి, సుంకిడి, తలమడుగు, బరంపూర్, దేవాపూర్, ఖోడద్, రుయ్యాడి, సుంకిడి గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించి, డీజే పాటలకు నృత్యం చేశారు.
- నార్నూర్: నార్నూర్, గాదిగూడ మండలం నుంచి భారీగా వాహనాల్లో నాయకులు తరలివెళ్లారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ రజతోత్సవ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారని అన్నారు.
- బేల: మండల కేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ అక్షిత సతీష్ పవార్ కార్యాలయం వద్ద ఆదివారం బీఆర్ఎస్ జెండాను మండల అధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి ఆవిష్కరించారు. దీంతో పాటు మండల శ్రేణులతో కలిసి వరంగల్ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.
- తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక వాహనాలల్లో సభకు తరలివెళ్లారు.
- బోథ్: బోథ్, సొనాల మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. అంతకుమందు గ్రామాల్లో పార్టీ పట్టణ, గ్రామ అధ్యక్షులు పార్టీ జెండా ఎగురవేశారు. బోథ్ నియోజకవర్గం నుంచి 40 ఆర్టీసీ బస్సులు, దాదాపు 500ల వాహనాల్లో తరలివెళ్లినట్లు నాయకులు తెలిపారు.
- ఇంద్రవెల్లి: మండల అధ్యక్షుడు మారుతి డొంగ్రె ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వాహనాల్లో సభకు తరలివెళ్లారు.
- ఇచ్చోడ: వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఆధివారం కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. 60 వాహనాల్లో తరలివెళ్లినట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి తెలిపారు.

ఎండిన పల్లెప్రకృతి వనాలు

ఇంద్రవెల్లి: గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెప్రకృతి వనాలు అధ్వానంగా మారాయి. అధికారులు దృష్టి సారించకపోవడంతో మామిడిగూడ, గౌరపూర్, మోహన్‌గూడ, తాటిగూడ, హర్కపూర్‌ఆంధ్‌గూడ, వడగామ్ గ్రామాల ప్రకృతి వనాల మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కలకు నీటిని అందించి, సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలి

నేరడిగొండ: సికింద్రాబాద్ ఆర్ఎల్‌డీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రామానుజాచారి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో రాష్ట్ర లెక్చరర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మధుసూధన్ రెడ్డి, బలరాం జాదవ్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రామానుజాచారి ఇంటర్మీడియట్ విద్యలో లెక్చరర్, ప్రిన్సిపాల్‌గా పనిచేయడమే కాకుండా సంఘ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.

'అపూర్వ' సమ్మేళనం



నార్నూర్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నార్నూర్ మండలంలోని భీంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986– 87 బ్యాచ్‌కి చెందిన, బేల మండలంలోని సాంగిడి గ్రామంలోని మోతిజీ మహరాజ్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000– 01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తరువాత ఒకచోట కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పినా.. గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

– నార్నూర్, బేల



బేల: పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేడు భూభారతిపై అవగాహన సదస్సులు

తాంసి: మండల కేంద్రంలోని రామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో సోమవారం భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తాంసి తహసీల్దార్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే అవగాహన సదస్సుకు కలెక్టర్ రాజర్షి షాతో పాటు జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు పే ర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు సదస్సుకు హాజరై తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం 2025 (నూతన ఆర్ఓఆర్ చట్టం)పై సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో గల రుక్మిణి గార్డెన్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ సాయి మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, డివిజనల్ రెవెన్యూ అధికారులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొనడం జరుగుతుందన్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు.

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామ సమీపంలో ఆయూష గార్డెన్‌లో భూభారతిపై మంగళవారం నిర్వహించే అవగాహన సదస్సును విజయవంతం చేయాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ కోరారు. సదస్సుకు కలెక్టర్, ఆర్డీవో హాజరు కావడం జరుగుతుందన్నారు. ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాలు సేకరణ



వివరాలు నమోదు చేస్తున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రా మంలో ఎంపీడీవో రమేశ్ ఆదివా రం ఇందిరమ్మ కమిటీతో ఎంపిక చేయబడిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి దారులను కలిసి పలు వివరాలు సేకరించారు. ప్రస్తుతం వారు నివసిస్తున్న ఇళ్లు, వ్యవసాయ భూమి వివరాలు, ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నియమ నిబంధనలు వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని చెప్పే మధ్యవర్తులను నమ్మవద్దని బోథ్ ఎంపీడీవో రమేశ్ పేర్కొన్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు అందించే విధానాన్ని వివరించారు. వెంట పంచాయతీ కార్యదర్శి దొంగరి గంగయ్య, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.